# ఆకలీ! నీకు జోహార్లు!!

రోడ్డు అంతా జన సమూహంతో నిండివుంది. ట్రాఫిక్ అంతా జామ్ అయింది, సమయం సరిగ్గా ఉదయం తొమ్మిదిగంటలు. రోడ్డుమీద రకరకాల వాహనాలయొక్క హారన్‌లు, రకరకాలశబ్దం జేస్తున్నాయి. రోడ్డు అంతా గోలగా ఉంది. ఎక్కడచూసినా జనం. నేల ఈనినట్లుగా ఉంది. ఏమాత్రం ఖాళీ దొరికినా తప్పించుకొని వెళ్ళిపోవ డానికి ప్రయత్నిస్తున్నారు. ఇది ఆ రోడ్డుకి క్రొత్త ఏమీ కాదు. ఆరోడ్డు ఎప్పుడూ అంతే. టౌనులో ఉన్న రోడ్డులన్నింటిలోను ఎక్కువ ట్రాఫిక్‌తో నిండిఉండిన అతి సన్నవిరోడ్డు అది. ట్రాఫిక్‌కూడా పెరిగిన, స్థానికులు ఎంత కోరినా, మున్సిపాలిటీ ఛైర్‌మేన్‌లు ఎంతమంది మారినా, ఆరోడ్డునుమటుకు ఎవరూ వెడల్పు చేయలేక పోయారు. దానికి కారణం ఆ భగవంతునికే తెలియాలి.

రోడ్డుమీది జనం వాళ్ళఅవస్థలు వాళ్ళు పడుతుంటే ఆ రోడ్డుప్రక్కనఉన్న ఓ పదేళ్ళకుర్రాడు ఆకలితో అరుస్తున్నాడు. వాడు అరుస్తున్నాడు కాని, అడుక్కోటం లేదు. 'పాలిష్ చేస్తాను, ఓ పావలా ఇప్పించండి' అంటున్నాడు అంతే. ఆ కుర్రాడికి ఆత్మాభిమానం ఉంది. అందుకేనేమో అడుక్కోటం లేదు. కాని వాడిబాధ పట్టించుకొనే నాధుడేది? చాలాసేపు అరిచినతరువాత నోరు నొప్పిపుట్టి కొద్దిసేపు ఊరుకున్నాడు, ఆ కుర్రాడిలాగ అందరూ పనికితగ్గ ప్రతిఫలం సంపాదించుకుందాం కాని ఊరుకునే ఆడుక్కోవడం ఎందుకు అని అనుకొంటే ఈదేశంలో ఇంతమంది బిచ్చగాళ్ళు ఉండేవారు కారేమో। దేశం కొద్దిగానైనా ప్రగతి సాధించి ఉండేదేమో। వాడికి ఆకలి విపరీతంగా వేస్తుంది, కడుపు నకనక లాడుతుంది. రాత్రి తిన్నఅన్నం ఏమైందో అర్థం కావడంలేదు.

ఏదో గుర్తుకువచ్చినవాడిలాగ అతని ఏవదాస్తి అడున చిరుగులసంచిలోకి చేయిపెట్టాడు. చేతికి రెండు బ్రష్‌లు ఒక పాలిష్‌డబ్బా, మరొక చిన్నడబ్బా దొరికింది. వాటిని పైకి తీసాడు. చిన్నడబ్బాతెరిచి ఆశగా (డబ్బులు ఉంటాయేమోనని) చూసాడు. కాని వాడికి నిరాశే ఎదురైంది. మూతవేసి సంచిలోపల పెట్టాడు. కడుపులోని ఆకలిని ఆపాలనేఉద్దేశంతో రోడ్డుప్రక్కన ఉన్న కుళాయిదగ్గర కడుపునిండా నీరు త్రాగాడు.

తిరిగివచ్చి కొద్దిసేపు 'పాలిష్ పాలిష్' అని అరిచాడు, తనకి తెలిసినదగ్గరినుంచి తనని తాత పెంచాడు. తనకి అందరిలాగ అమ్మా, నాన్నా ఉంటే బాగుండునని ఎన్నో సార్లు అనుకునేవాడు. తాతని వారిగురించి అడిగితే తనకి తెలియదనేవాడు. అప్పుడు తనకి ఏడుపొచ్చేది. తాత ఉండే టప్పుడు తను రోజూ బన్ను తినేవాడు. ఇప్పుడయితే ఒకోరోజు తింటున్నాడు, ఒకోరోజు పస్తుంటున్నాడు. తనకి ఇంత చిన్నవయస్సులోనే పస్తు ఉండడం అలవాటైంది. తాతకూడా పాలిష్‌చేసే సంపాదించేవాడు. తాత చనిపోయినరోజు తనకి ఇంకా గుర్తుంది. తాత చనిపోయి రోడ్డుప్రక్కన పడిఉంటే అక్కడ అంతా డబ్బులు పడేశారు. ఆ డబ్బును తీసుకోవాలని ఎందుకనో అనిపించలేదు. ఎవరోవచ్చి చెత్తబండిమీద తాతని తీసుకొని పోయారు. వాళ్ళు అక్కడి డబ్బులుకూడా తీసుకొనిపోయారు.

అదంతా తలపుకొచ్చి కళ్ళనుండి నీరు కారాయి. అక్కడ ఎంతసేపు ప్రయత్నించినా ఒక బేరం కూడా రాలేదు. తనలోని ఆకలి మరొకసారి విజృంభించింది. శక్తినంతా కూడగట్టుకొని రైల్వేస్టేషన్‌దగ్గరకు చేరుకున్నాడు. మధ్యాహ్నం ఆయినా అక్కడ ఎవరూ పాలిష్ చేయించుకోలేదు. ఎంతో కష్టంమీద ఒక అర్థరూపాయి సంపాదించగలిగేడు. అర్థరూపాయి సంపాదించడమే మొదలు బన్ను తినడానికని ఆ సంచిపట్టుకొని టీ దుకాణంవైపు పరుగుతీసాడు. ఆ ఆత్రుతతో ఎదురుగావస్తున్న లారీని చూసుకోలేదు. రోడ్డుని క్రాస్ చేయబోయి లారీ వెనుక చక్రంక్రింద పడ్డాడు. అంతే 'అమ్మా' అంటూ కేకవేసి అక్కడికక్కడే మూర్ఛిల్లి పడ్డాడు. ఎంతైనా ఆకలీ నీకు జోహార్లు। ఇలా ఎంతమంది ప్రాణాలు బలిగొంటావో।

—ఓం శివ.

ఎల్లప్పుడూ.......
టి. ఎన్. హెచ్. వారి
* సైనిక్స్ * ఆర్. ఓ.
కలర్ బనిన్లనే
ఉపయోగించండి.
ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం - 4.